నిఘా నిస్తేజం.. భద్రత గాలికి..

కొన్ని నెలలుగా మండలంలో దొంగలు పెట్రేగిపోతున్నారు. దుకాణాలు, దేవాలయాలు, తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. అందినకాడికి దోచుకుని పరారవుతున్నారు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసుల నిఘాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- వెంకటాచలంలో పెట్రేగిపోతున్న దొంగలు
- పథకం ప్రకారం చోరీలు
- భయాందోళనలో ప్రజలు
- సొత్తు రికవరీ అంతంతమాత్రమే..



జైన్ దేవాలయంలో పగులగొట్టిన హుండీ (ఫైల్)

వెంకటాచలం: మండలంలో దొంగతనాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. కొన్ని కేసుల్లో మాత్రమే పోలీసులు సొత్తును రికవరీ చేశారు. పగటి సమయంలో రెక్కీ నిర్వహిస్తున్న దొంగలు ప్రజలు నిద్రలోకి జారుకున్న తర్వాత పక్కా పథకంతో చోరీలకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తెల్లవారుజామున మూడు గంటల్లోపే దొంగతనాలు అత్యధికంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో తాళం వేసిన నివాసాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. అర్ధరాత్రి వాటిల్లోకి ప్రవేశించి తెల్లవారే సరికి విలువైన వస్తువులు ఒక్కటీ లేకుండా చేసేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణాల్లో తలుపులు, రేకులు పగులగొట్టి విలువైన వస్తువులు చోరీ చేస్తుండడంతో వ్యాపారస్తులు భయపడుతున్నారు.

ఇటీవల

మూడు రోజుల క్రితం మండలంలోని యూపీవి పాలిమర్స్ పైపుల తయారీ ఫ్యాక్టరీలో రూ.30 లక్షల విలువ చేసే పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇదే ఫ్యాక్టరీలో గతంలో రెండుసార్లు దొంగతనాలు జరిగాయి. ఇప్పటి వరకు పోలీసులు రికవరీ చేయకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నెల 6వ తేదీన చెముడుగుంట వద్దనున్న ప్రభుత్వ మద్యం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.2.60 లక్షలు అపహరించుకెళ్లారు. జూన్ నెలలో గొలగమూడి గ్రామానికి చెందిన శేఖర్ నాయుడు అనే వ్యక్తి నివాసంలో రూ.25 వేలు నగదు చోరీ చేసి పరారయ్యారు. పోలీసులు పటిష్ట నిఘా పెట్టకపోవడంతోనే దొంగతనాలు అధికమయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయాల్లోనూ..

మండలంలో ఇటీవల దేవాలయాల్లో చోరీలు ఎక్కువయ్యాయి. గుడుల్లోకి ప్రవేశించి తాళాలు పగులగొడుతున్నారు. హుండీలను ఎత్తుకెళ్లి దొరికినంత దోచుకుని వాటిని పొలాల్లో పడేసి వెళ్లిపోతున్నారు. ఇంకా స్వామి, అమ్మవార్ల మెడలో బంగారు, వెండి నగలను దోచుకెళ్తున్నారు. చెముడుగుంట, చవటపాళెం గ్రామాల్లో గతంలో చోరీలు జరిగాయి. ఇటీవల కసుమూరు పంచాయతీ చింతలపాళెం, కాకుటూరు, కంటేపల్లి ఆలయాల తలుపులు పగులగొట్టి బంగారు నగలు, హుండీలను ఎత్తుకెళ్లారు. జూన్ నెల మూడో తేదీన జైన్ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీ పగులగొట్టి నగదును అపహరించారు. గ్రామాల్లో దొంగతనాలు పెరిగిపోవడంతో ప్రజలు బంగారు నగలు, డబ్బును నివాసాల్లో ఉంచేందుకు భయపడిపోతున్నారు. తాళాలు వేసిన నివాసాల్లో పట్టపగలే చోరీలు జరుగుతున్నాయని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

సిబ్బంది కొరత

దొంగతనాలను పోలీసులు అరికట్టలేకపోతున్నారు. మండలంలో 25 గ్రామ పంచాయతీలున్నాయి. రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాలున్నాయి. పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో చోరీలపై నిఘాపై దృష్టి సారించలేకపోతున్నారు. ఉన్న సిబ్బందితో విధులకు న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో దొంగల ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది.


సర్వేపల్లి వద్దనున్న పైపుల ఫ్యాక్టరీలో పోలీసుల విచారణ (ఫైల్)


చెముడుగుంటలో చోరీ జరిగిన మద్యం దుకాణం (ఫైల్)

‘ఉల్లాస్’ విజయవంతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ నారాయణరావు

కొడవలూరు : నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేసే ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వీఓఏలు కృషి చేయాలని అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ నారాయణరావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్‌పై పొదుపు సంఘాలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలు పొదుపు సభ్యుల సహకారంతో పది మంది నిరక్షరాస్యులకు తగ్గకుండా అక్షర బుద్ధులు నేర్పాలన్నారు. ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ నిరక్షరాస్యులకు వెసులుబాటుగా ఉండే సాయంత్ర వేళల్లో బోధన చేయాలన్నారు. పగటిపూట పనులకు వెళ్తున్నందున నిరక్షరాస్యులు అందుబాటులో ఉండరని తెలిపారు. పనుల నుంచి ఇంటికి చేరిన తరువాత చదువు నేర్పించాలన్నారు. సమావేశంలో ఏపీఎం జి.కృష్ణవేణి, సీసీలు పాల్గొన్నారు.

- పొదలకూరు: ఉల్లాస్ (అందరికీ జీవితకాలం అభ్యాసంపై అవగాహన) కార్యక్రమంలో వీఓఏలు, సీసీలు, వలంటీర్ టీచర్ల పాత్రే కీలంగా ఉంటుందని వయోజన విద్య డీడీ ఎస్.మహ్మద్ అజాద్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ మీటింగ్ హాల్లో శనివారం ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన డీడీ మాట్లాడుతూ జిల్లాలో నూరుశాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో కలెక్టర్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించడం జరిగిందన్నారు. తోటపల్లిగూడూరు మండలం నరుకూరు, చినచెరుకూరు గ్రామాల్లో యాప్‌ను ప్రయోగాత్మకంగా ఉపయోగించామన్నారు. గతంలో జిల్లాలో సాక్షరభారత్, అక్షర చైతన్యం తదితర కార్యక్రమాల ద్వారా అక్షరాస్యతను సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీవీ నరసింహారావు, వెలుగు ఏపీఎం చిన్నయ్య, ఎంఈఓ రేణుక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక మాస పూజలు


పొదలకూరు: శివాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

పొదలకూరు: కార్తీక మాసం సందర్భంగా శనివారం ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానంలో ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి ఆకాశ దీపాన్ని వెలిగించారు. మహిళా భక్తులు నూనె పోసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు.

- చెన్నారెడ్డిపల్లి పంచలింగేశ్వరాలయంలో కార్తీక మాస పూజలు మొదలయ్యాయి. చుట్టుపక్కల గ్రామాలైన నావూరు, నావూరుపల్లి, భోగసముద్రం నుంచి మహిళా భక్తులు హాజరై కార్తీక దీపాలు వెలిగించారు.
- పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీప మహోత్సవాలను ప్రారంభించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ప్రమిదలు వెలిగించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా శ్రీనివాసులు – వెంకటలక్ష్మీసునీత, మధుసూదన్ – సుష్మ దంపతులు వ్యవహరించారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.
- బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో శనివారం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆకాశదీపం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


జొన్నవాడలో భక్తులు


పొదలకూరు: ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..


పూలమొక్కను అందజేస్తున్న నాయకులు

కోవూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడు గ్రామానికి చెందిన పార్టీ నేతలు శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. పూల మొక్క అందించి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు బిల్లా వినోద్‌కుమార్, శ్రీను, వెంకటరమణయ్య, పార్టీ బుచ్చి మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి ఉన్నారు.

ప్రసన్న పరామర్శ



కోవూరు: మండలంలోని లేగుంటపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గుణపాటి తులసీరెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి ఇటీవల మరణించారు. ఈ క్రమంలో ఆయన కుటుంబ సభ్యులను వారి నివాసంలో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట శివారెడ్డి, పెనక శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జెట్టి శ్యామసుందర్‌రెడ్డి, గంపా జగన్నాథం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విష్ణాలయంలో ధనలక్ష్మి పూజ


పూజల్లో పాల్గొన్న మహిళలు

మనుబోలు: దీపావళి పండగను పురస్కరించుకుని స్థానిక విష్ణాలయంలో శుక్రవారం రాత్రి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ధనలక్ష్మి పూజను వైభవంగా నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు అమ్మవారికి అభిషేకాలను చేశారు. అనంతరం ధనలక్ష్మి అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న వెంకయ్యస్వామి మందిరంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు స్వామికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. గురించర్ల హరేందర్‌రెడ్డి, పద్మజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే చర్యలు

- ఎస్సై శివరాకేష్


మాట్లాడుతున్న ఎస్సై

మనుబోలు: ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివరాకేష్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని మైనింగ్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు. ఇసుక, గ్రావెల్ అవసరమైన వారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. స్థానిక అవసరాలకు మాత్రమే ఇసుక తీసుకెళ్లవచ్చన్నారు. మనుబోలు మండలం నెల్లూరు, తిరుపతి జిల్లాలకు బోర్డర్‌లో ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టు ఏర్పాటు చేసేందుకు తహసీల్దార్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించినట్లు వెల్లడించారు.

గుండెపోటుతో బస్సు క్లీనర్ మృతి

అనుమసముద్రంపేట: గుండెపోటుతో బస్సు క్లీనర్ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు..ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ముస్తాపురం ప్రాంతానికి చెందిన గడ్డం రామయ్య, పెంచలమ్మ దంపతుల రెండో కుమారుడు గడ్డం రమేష్ (33) ఏఎస్‌పేట–హైదరాబాద్ నడుమ తిరిగే ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఏఎస్‌పేటకు బయలుదేరిన బస్సులో డ్రైవర్ పక్కన నిద్రించాడు. శనివారం ఉదయం ఏఎస్‌పేటకు బస్సు చేరుకున్న తర్వాత డ్రైవర్ నిద్రలేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. బస్సును నిలిపి పరిశీలించగా రమేష్ మృతి చెంది ఉన్నాడు. దీంతో ఏఎస్‌పేట ఎస్సై సైదులుకు సమాచారం అందజేయగా మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా రమేష్‌కు భార్య అనూష, కుమారుడు ఉన్నారు. రమేష్ మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గొలగమూడి విద్యార్థినులు


పూజ


శ్రీలత

వెంకటాచలం: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ – 19 ఫుట్‌బాల్ పోటీలకు గొలగమూడిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీకామేశ్వరీదేవి, పీడీ షేక్ షబిక శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 9 తరగతి చదువుతున్న పి.పూజ, సీహెచ్ శ్రీలత ఎంపికయ్యారని వెల్లడించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు


వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై

తోటపల్లిగూడూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై వీరేంద్ర బాబు హెచ్చరించారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో శనివారం రాత్రి ఎస్సై తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం మత్తులో మోటార్‌బైక్‌లు నడుపుతున్న పలువురికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

మనుబోలు: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం మండలంలో పర్యటించారు. మడమనూరు, అక్కంపేట సమీపంలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.30 కోట్లతో కొలనకుదురు, యాచవరం, తిరుమలమ్మపాళెం గ్రామాల వద్ద కాలువలపై వంతెనలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.123 కోట్ల సీఆర్‌ఎఫ్ నిధులకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. తొలుత మడమనూరు వద్ద జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు.

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం


నరుకూరు జానావారిపాళెంలో అన్న ప్రసాద వితరణ

పొదలకూరు: స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానం (శివాలయం ప్రాంగణం)లో డిసెంబర్ ఒకటో తేదీ వరకు అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం నిర్వహిస్తారు. శనివారం నుంచి దీనిని ప్రారంభించినట్టు అయ్యప్ప సేవా సమాజం నిర్వాహకులు వెల్లడించారు. నిత్యం 200 నుంచి 250 మందికి అన్నదానం చేస్తామన్నారు. ఉభయకర్తలుగా ఎ.మస్తాన్‌రెడ్డి, ఐతా రవి, జనకల శ్రీనివాసులు, ఇండ్ల రవి వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో సేవా సమాజం బాధ్యులు శివాడ పరంధామిరెడ్డి, ముత్తుకృష్ణ, చొప్పా వెంకటేశ్వర్లు, వీరేపల్లి శ్రీనివాసులు, ఎం.శేఖర్‌బాబు, కృష్ణయ్యనాయుడు, అడపాల మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు జానావారిపాళెం గ్రామంలో మన అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న మండల దీక్షా అన్న ప్రసాద వితరణకు విశేష స్పందన లభిస్తోంది. గత నెల 20వ తేదీన ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈనెల 29వ తేదీ వరకు జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 350 మంది భక్తులు హాజరవుతున్నారు.

కమ్మేసిన పొగ.. బెంబేలెత్తిన జనం


ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగ

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెం బైపాస్ రోడ్డులో ఉన్న అదానీ యూనిట్ – పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి శనివారం సాయంత్రం వెలువడిన పొగ చుట్టుపక్కల గ్రామాల ప్రజలను హడలెత్తించింది. అగ్నిప్రమాదాన్ని తలపించే విధంగా ఫ్యాక్టరీ గొట్టాల నుంచి వెలువడిన పొగ దట్టంగా కమ్మేసింది. ప్రమాదమని భావించి రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పరుగులు తీసింది. అయితే ఫ్యాక్టరీలోని బాయిలర్ మెయింటెనెన్స్ వల్ల చిమ్నీలో బొగ్గు పొడి మండకుండా పేరుకుపోయింది. తర్వాత ఒక్కసారిగా మండి పొగ రూపంలో వెలువడింది. పది నిమిషాల తర్వాత బాయిలర్ శుభ్రం చేయడం పూర్తవడంతో పొగ వ్యాపించడం నిలిచిపోయింది. దీంతో మండల యంత్రాంగం కూడా ఊపిరి పీల్చుకుంది. ఇది అగ్ని ప్రమాదం కాదంటూ ప్రకటన విడుదల చేసింది.

సమస్యలను పరిష్కరిస్తాం


గ్రామసభలో వినతుల స్వీకరణ

కొడవలూరు: భూముల రీసర్వేలో తలెత్తిన సమస్యలకు పరిష్కారం చూపుతామని రీసర్వే డీటీ అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని యల్లాయపాళెంలో శనివారం గ్రామసభ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ పరిధిలో సమస్యలను మాత్రమే 15 రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల పరిధిలోని వాటికి కొంత వ్యవధి అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, ఆర్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థి డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో ఒక విద్యార్థి డిబారైనట్లు వర్సిటీ నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 3,761 మంది విద్యార్థులకు గానూ 3,509 మంది హాజరైనట్లు తెలియజేశారు. నెల్లూరు నగరంలోని సర్వోదయ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ


దాసరిపాళెంలో విత్తన నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ దేవసేన

కొడవలూరు: మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలను ఆత్మకూరు ఏడీఏ దేవసేన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రిజిస్టర్లతో పాటు నిల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని చెప్పారు. షాపుల్లో నిల్వ వివరాలు, ధరలను షాపు వద్ద పట్టికలో విధిగా ప్రదర్శించాలన్నారు. ఏడీఏ వెంట ఏఓ సీహెచ్‌ఎస్.లక్ష్మి, వీఏఏలు డి.శివజ్ఞాన, మహేష్ ఉన్నారు.

కొరుటూరులో వైద్యశిబిరం



ఇందుకూరుపేట : మండలంలోని కొరుటూరులో పశువులకు సంబంధించి ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె.రమేష్ నాయక్ పాడిరైతులకు పలు సూచనలు చేశారు. మేలైన పశుజాతి ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య దూడలను పొందవచ్చని తెలియజేశారు.

సాగునీరు పారేదెలా..?

- ఊసేలేని సాగునీటి సలహా కమిటీ సమావేశం
- కాలువల్లో పూడిక తీయకుండానే నీటి విడుదలకు సన్నాహాలు


దుస్థితిలో కనిగిరి రిజర్వాయర్

బుచ్చిరెడ్డిపాళెం : రైతులకు ఉపయోగపడే పనులు చేయడంలో కూటమి ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి ఉండడం లేదు. ఓ పక్క రైతులు సాగుకు ఉపక్రమిస్తుంటే ఇప్పటికీ సాగునీటి విడుదలకు అవసరమైన జిల్లా సాగునీటి సలహా కమిటీ సమావేశం నిర్వహించకపోవడం గమనార్హం. ఇప్పటికే సోమశిలలో 65 టీఎంసీలు, బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్‌లో 18 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయి. వీటిని విడుదల చేసేందుకు అవసరమైన కాలువల మరమ్మతులు మాత్రం నేటికీ చేపట్టకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఎంటో అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎండీ ఫరూక్ అధ్యక్షతన జిల్లాలోని అందరి ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, కలెక్టర్‌తో సహా సాగునీటి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఆ సమావేశం నిర్వహించలేదు. నెల్లూరు డెల్టాగా పేరుగాంచిన కోవూరు, సర్వేపల్లి, అల్లూరు, నెల్లూరులతో పాటు ఇతర ప్రాంతాల్లో విస్తారంగా వరిసాగు చేస్తారు. అయితే వాటి పరిధిలో ఒక్క కాలువకు కూడా పూడిక తీసిన పాపాన పోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదటగా కనిగిరి రిజర్వాయర్ నుంచి దక్షిణ, ఉత్తర కాలువలు, అల్లూరు కాలువల నుంచి నీటిని విడుదల చేసేవారు. అనంతరం మెట్ట ప్రాంతమైన కావలి కెనాల్‌కు నీటిని విడుదల చేయడం పరిపాటి. కానీ ఈ సంవత్సరం మాత్రం కావలి ఎమ్మెల్యే మొదటగా కావలి కెనాల్‌కు నీటిని విడుదల చేసుకుని వెళ్లారు. దీంతో ఈ సంవత్సరం సాగునీటి సలహా కమిటీ సమావేశం జరుగుతుందా, లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా అధికారులు యుద్ధ ప్రాతిపదికన సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టి నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు నీటి విడుదల

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం దక్షిణ కాలువ (సదరన్ చానెల్), ఉత్తర కాలువ (అల్లూరు కాలువ)లకు నీటిని విడుదల చేయనున్నట్లు ఆమె కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. పంట కాలువలకు మరమ్మతులు లేకుండానే నీరు విడుదల చేయడమేమిటంటూ రైతుల్లో చర్చ కొనసాగుతోంది.


నాచు, గుర్రపుడెక్కతో నిండిన పంట కాలువ